ఇంటాక్ సేవలను విస్తరిద్దాం : డిఎస్‌పి

ప్రజాశక్తి కడప అర్బన్

ఇంటాక్ సంస్థతో పాటు సేవలను కూడ విస్తరించేందుకు ప్రజలు కలిసి వస్తే తన వంతు సహకారం తప్పక ఉంటుందని డిఎస్‌పి ఎం.డి. షరీఫ్ అన్నారు. ఆదివారం మానస ఇన్‌లో భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ నూతన కన్వీనర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వారసత్వ రక్షణ బాధ్యతను విద్యార్థుల పాఠ్యపుస్తకాలలోని ప్రతిజ్ఞ ద్వారా ఆనాడే మన విద్యావేత్తలు మన బాధ్యతను గుర్తు చేశారన్నారు. జిల్లా వాసుల జీవన విధానం, దాన గుణం, ఆహారం సంస్కృతి సంప్రదాయాలు విలక్షణమైనవని ప్రజలకు వారసత్వ సంపదపై అవగాహన కల్పిస్తే వాటిని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్ రెడ్డి, నూతన కన్వీనర్‌గా లయన్ కె. చిన్నప రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. కో-కన్వీనర్, 70 మంది నూతన సభ్యులతో కూడా ప్రమాణం చేయించారు.

దెబ్బతిన్న లింగాల కుడికాల్వ!

లింగాల కుడికాల్వ

500 ఎకరాల ఉద్యాన తోటల్లోకి సీపేజ్

ప్రశ్నార్థకంగా నిమ్మ, అరటి తోటల సాగు

మూడు మండలాల్లోని గ్రామాల్లోకి ఊటనీళ్లు

ఉద్యాన పంటల పరిహారానికి జెల్ల

పజాశక్తి - కడప ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గ పరిధిలోని లింగాల కుడికాల్వ లైనింగ్ మరమ్మతులకు గురైంది. 2010లో మైటాస్ సంస్థ 58 కిలోమీటర్ల లింగాల కుడి కాల్వ పనుల్ని పూర్తి చేసింది. 12 ఏళ్ల అనంతరం గతేడాది చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిపారుదల శాఖ 9.9 టిఎంసిలను పూర్తిస్థాయిలో నిల్వచేసింది. నిండుకుండలా మారిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించిన 16 లిఫ్టుల పరిధిలోని 59 వేల ఎకరాలకు సాగునీటి విడుదల చేసింది. లింగాల కుడి కాల్వ ద్వారా 400 క్యూసెక్కులను విడుదల చేసింది. పులివెందుల, లింగాల, వేముల మండలాల్లోని 22 చెరువులకు నీటిని మళ్లించింది. పదేళ్లుగా పూర్తి స్థాయిలో సాగునీటిని సరఫరా చేయని నేపథ్యంలో లింగాల కుడి కాల్వ లైనింగ్ 16. కి.మీ, 19 కి.మీ, 32వ కి.మీ, 42వ కి.మీ ప్రాంతాల్లో మరమ్మతులకు గురైంది. ఫలితంగా కుడికాల్వ దిగువ భాగంలోని 500 ఎకరాల్లోని ఉద్యాన పొలాలు, పలు గ్రామాల్లోనికి ఊరట నీరు చేరుతోంది. లింగాల కుడి కాల్వ 285 కాంటూరు లెవల్, చెరువులు 330 కాంటూర్ లెవెల్‌లో ఉన్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల్లోనికి సీపేజ్ నీరు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ పేర్కొంటోంది. ఫలితంగా 280 కాంటూర్ లెవెల్‌లో దిగువ భాగాన ఉన్న లింగాల, పులివెందుల, వేముల మండలాల్లోని పార్న పల్లి, వెలిదండ్ల, కర్నపా పాయపల్లి, లింగాల, చిన్న కుడాల, పెద్దకుడాల, కామ సముద్రం, ఇప్పెట్ల గ్రామాల పరిధిలోని 350 ఎకరాల నుంచి 500 ఎకరాల్లో నిమ్మ, అరటి తోటల్లోకి సీపేజ్ నీరు చేరుతోంది. 350 ఎకరాల్లో నిమ్మ, 150 ఎకరాల్లో అరటి తోటలు ఎండిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మినహా మిగిలిన పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, వేంపల్లి, ఉద్యానతోటలకు నిలయం. ఇక్కడి నుంచి విదేశాలకు ఉద్యాన ఉత్పత్తులు ఎగుమతులు చేయం పరిపాటి. ఇటువంటి పరిస్థితుతల నేపథ్యంలో ఐదు నుంచి పదేళ్ల పాటు పెంచుకున్న నిమ్మ, అరటి తోటల్లోకి సీపేజ్ ఊటనీరు చేరిన కారణంగా ఎండిపోతుండడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. ఉద్యాన రైతుల ఆవేదనల నేపథ్యంలో ప్రభుత్వం హార్టీకల్చరల్, గ్రౌండ్‌వాటర్, ఛీఫ్ ఇంజినీర్, సిఇసిడిఒ, సిఇ హైడ్రాలజీ, నీటి పారుదలశాఖ ఎస్‌ఇలతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. నిపుణుల కమిటీ సీపేజ్‌ను అరికట్టడానికి గల అవకాశాలను మాత్రమే పరిశీలించింది. నిలువునా ఎండి పోయిన ఉద్యాన పంటల పరిహారాన్ని విస్మరించడం విస్మయాన్ని కలిగిస్తోంది. 280, 230, 240 కాంటూర్ లెవల్‌లో ఉన్న గ్రామాల్లోకి సీపేజ్ నీళ్ల రాకుండా అరికట్టడంపైనే దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి లింగాల కుడి కాల్వ కిందిభాగంలో ట్రెంచ్‌లు తవ్వడం, ట్రెంచ్‌ల్లోకి వచ్చే నీటిని డ్రెయినేజ్‌లు, వాగుల్లోకి మళ్లించడం వంటి సూచనలు చేయడం మినహా పరిహారం మాటను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది.

ఎండిపోయిన నిమ్మచెట్లు

సీపేజ్‌పై దృష్టి పెట్టాం

లింగాల కుడికాల్వ దిగువ ప్రాంతాల్లోనికి సీపేజ్ చేరుతున్న మాట వాస్తవమే. నిపుణుల కమిటీ సూచనల మేరకు రూ.14 కోట్లతో కూడిన ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం లభించింది. త్వరలో టెండర్లు నిర్వహించే ప్రయత్నాల్లో ఉన్నాం. సాధ్యమైన మేరకు అరికట్టే ప్రయత్నం చేస్తాం.

- ఎం.మల్లికార్జునరెడ్డి, జిఎన్ఎస్ఎస్ ఎస్ఇ. కడప.

ఎరువుల నిల్వకు పెద్దపీట

ఖరీఫ్ బఫర్ లక్ష్యం 4,550 టన్నులు

మార్క్‌ఫెడ్ మేనేజర్ ఎం.పరిమళజ్యోతి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా అవసరాలకు సరిపడా రసాయన ఎరువులను సరఫరా చేయడమే మార్క్‌ఫెడ్ లక్ష్యం. ప్రతి ఏటా రాష్ట్ర అధికార యంత్రాంగం ఎరువుల నిల్వ, సరఫరా వ్యవహారాల నిర్వహణకు టెండర్ పిలుస్తోంది. ఈ ఏడాది నోడల్ ఏజెన్సీగా అవంతి వేర్ హౌసింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ టెండరు దక్కించుకుంది. 2023-24 ఖరీఫ్ సీజన్ ముగిసిన నేపథ్యంలో ఖరీఫ్ అవసరాలకు సరిపడా ఎరువులను నిల్వ ఉంచడంలో భాగంగా కొనుగోలు చేసి నిల్వ చేయాల్సి ఉంది. గత రబీ సీజన్‌లో 12 వేల మెట్రిక్ టన్నుల మేరకు ఎరువులను కొనుగోలు చేయడంతోపాటు అందుబాటులో ఉంచాల్సి ఉంది. జిల్లాలోని 416 రైతు భరోసా కేంద్రాలకు డిమాండ్‌ను బట్టి ఎరువులను సరఫరా చేస్తున్నామని మార్క్‌ఫెడ్ అగ్రిఇన్‌ఫుట్ జిల్లా మేనేజర్ యం.పరిమళజ్యోతితో ప్రజాశక్తి ముఖాముఖి..

బఫర్‌స్టాక్ నిల్వల గురించి చెప్పండి?

2022-23 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల మేరకు ఎరువులను కొనుగోలు, నిల్వల వ్యవహారాన్ని సమర్థవంతంగా నిర్వహించాం. ఈయేడాది 4,550 మెట్రిక్ టన్నుల మేర నిల్వ ఉంచాం. 400 మెట్రిక్ టన్నుల డిఎపి, 3,300 టన్నుల యూరియా, 600 టన్నుల కాంప్లెక్స్, 250 టన్నుల ఎంఒపి ఎరువులను కొనుగోలు చేసి గోడౌన్లలో నిల్వ చేశాం.

ఎరువుల సేకరణ లక్ష్యం ఎంత?

2022-23 ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది వేల టన్నుల మేరకు ఎరువుల క్రయ, విక్రయాలు సాగించడమే లక్ష్యం. ఈ ఏడాది 4,550 టన్నుల ఎరువులు నిల్వ చేయడమైంది. మిగిలిన 2,606 టన్నుల ఎరువులు బఫర్‌స్టాక్‌గా ఉన్నాయి.

ఎరువుల సేకరణ, నిల్వ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

ఎరువుల సేకరణ, నిల్వల పర్యవేక్షణకు నోడల్ ఏజెన్సీకి బాధ్య తలు అప్పగిస్తుంది. ఈయేడాది అవంతి వేర్ హౌసింగ్ సర్వీసెస్ లిమిటెడ్ కాంట్రాక్టు దక్కించుకునే అవకాశం ఉంది. సదరు కాంట్రాక్టు సంస్థ ఎరువుల నిల్వ, సరఫరా ఏర్పాట్లు చేస్తుంది. ఎరువుల సేకరణ దగ్గర నుంచి నిల్వ చేయడం, సరఫరా వంటి అంశాలను మార్క్‌ఫెడ్ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉంటుంది.

ఎరువుల గోడౌన్ల వివరాలు తెలపండి?

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మూడు గోడౌన్లు ఉన్నాయి. ఎస్టేట్ ఆవరణంలో రెండు, సెంట్రల్‌జైల్ సమీపంలో ఒకటి ఉంది. ఎరువుల బోగీ నుంచి లారీల్లో గోడౌన్లకు తరలించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో డిమాండ్ పెరిగితే జిల్లాలోని 36 మండలాలకు చెందిన 416 రైతు భరోసా కేంద్రాలకు తరలిస్తాం.

ఉద్యోగోన్నతలు మాన్యువల్‌గా చేపట్టాలి

ఫ్యాప్టో జిల్లా సెక్రెటరీ జనరల్ మహమ్మద్ ఇర్షాద్ డిమాండ్

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రస్తుతం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఉద్యోగోన్నతలు ఆన్‌లైన్‌లోగాక మాన్యువల్‌గా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా సెక్రటరీ జనరల్ షేక్ మహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉపాధ్యాయ ఉద్యోగోన్నతలు మాన్యువల్‌గా నిర్వహించాలని, బదిలీల్లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా షేక్. మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించడానికి ముందు మే 17న విద్యాశాఖ మంత్రి సమక్షంలో అధికారులకు, ఉపాధ్యాయ సంఘాలకు జరిగిన చర్చలలో బదిలీల అనంతరం ప్రమోషన్లను, మ్యానవల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగోన్నతుల ప్రక్రియ అందుకు భిన్నంగా నిర్వహించాలని నిర్ణయించడం సరికాదని విమర్శించారు. ఖాళీలను చూపకుండా ముందుగానే అన్ విల్లింగ్ తీసుకోవడం, గత ఉద్యోగోన్నతులు ఇచ్చే ప్రక్రియకు భిన్నమైందని పేర్కొన్నారు. 2022 జులైలో ఒకసారి, 2023 జనవరిలో మరొకసారి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతలు ఇస్తామని చెప్పి వారి నుంచి విల్లింగ్ తీసుకుని ప్రమోషన్ల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున అది తేలిన తర్వాత కల్పిస్తామని నమ్మించారని పేర్కొన్నారు. రూ.2500లు అలవెన్స్ పేరుతో సబ్జెక్ట్ ఉపాధ్యాయులుగా బోధన చేయించుకున్నారని తెలిపారు. బదిలీలలో 2015 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్యాంసుందర్ రెడ్డి, రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ విద్యా శాఖమంత్రి ఇచ్చిన హామీ సైతం నెరవేర్చకుండా అధికారులు రకరకాల నిబంధనల పేరుతో మ్యానవల్ కౌన్సెలింగ్ నిర్వహించకుండా చేయటం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందికి గురవుతున్నారన్నారన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చేయడం తగదన్నారు. ఖాళీలను బ్లాక్ చేయడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఎంఇఒ-2 ప్రమోషన్ కౌన్సెలింగ్ సైతం షెడ్యూల్ ప్రకటించకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ప్రమోషన్ కౌన్సెలింగ్ ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు మాన్యువల్‌గా నిర్వహించకపోతే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్, ఎస్టీయూ, ఎపిటిఎఫ్(1938), ఎపిటిఎఫ్(257), ప్రధానోపాధ్యాయ సంఘం, రూటా, బిటిఏ సంఘాల నాయకులు వై.మస్తానయ్య, ఎస్.గురయ్య, ఆర్.అబ్దుల్లా, ఎస్.ఎం.డి.జాఫర్,రామమోహన్, రామచంద్రారెడ్డి, నాగ భూషణం, సుధాకర్ రెడ్డి, రమణారెడ్డి, చెన్నారెడ్డి, దస్తగిరి, అయ్యవారురెడ్డి, హరిక్రిష్ణ, రవి కుమార్, నరసింహమూర్తి, ప్రతాప్, జయరాం, బాలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో నాయకుల నిరసన

హామీలు అమలు చేయకపోతే పోరాటలకు సిద్ధం

విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు కర్నూల్ అంజి

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విఆర్ఎలకు ఇచ్చిన హామీలు పరిష్కరించకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు కర్నూలు అంజి హెచ్చరించారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో కడప రెవెన్యూ డివిజన్ మండలాల విఆర్ఎల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వెంకటపతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ అంజి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తున్న సందర్భంలో, విజయవాడ అలంకార్ సెంటర్లో దీక్షలు చేస్తున్న సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు పెంచుతానని, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్న విఆర్ఎల సమస్యలు ఒకటి కూడా పరిష్కరించక పోగా ఉన్న జీవోలోనే కోత పెడుతున్నారని వాపోయారు. పైగా ఒక్కో విఆర్ఒ నుంచి రూ.19,500 రికవరీ చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నామినీగా ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్నా రెగ్యులర్ కాకపోవడం, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయక విద్యా అర్హత ఉండి కూడా ఉద్యోగోన్నతి లేకపోవడంతో అయోమయ పరిస్థితిలో విఆర్ఎలున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామ సేవకులకు పే స్కేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రమోషన్లు కల్పిస్తూ విఆర్ఎల జీవితాల్లో వెలుగు నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కన్నా మిన్నగా చేస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి తక్షణమే విఆర్ఎలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటానికి వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ నాగేంద్ర, అన్నమయ్య జిల్లా కో- కన్వీనర్ భోగేశ్వరయ్య, కడప రెవెన్యూ డివిజన్ నాయకులు రమణ,అశోక్,శివ,రజినీ కాంత్, కిశోర్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, ఓబులేసు పాల్గొన్నారు. **నూతన కమిటీ ఎన్నిక :** కడప రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా రమణ, కార్యదర్శిగా అశోక్ డివిజన్ నాయకులుగా శివ, రజినీ కాంత్, కిశోర్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, ఓబులేసుతోపాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు అంజి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ఫ్యూజ్‌ఆఫ్ కాల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

కడప విద్యుత్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సేవలు అందించుటకు ఏడు ప్రాంతాలలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చామని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్ తెలియజేశారు. ఆదివారం కడప టౌన్ పరిధిలోని ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల వివరాలను తెలిపారు. కొత్తకలెక్టరేట్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు 94 90615131కు, ఎన్‌జిఒ కాలనీ సెక్షన్ ప్రాంతానికి సంబంధించి 9490615136కు, నార్త్ సెక్షన్ ప్రాంతానికి సంబంధించి 9490 615137కు, సాయిపేట సెక్షన్ ప్రాంతానికి సంబంధించి 949061 5133కు, బాలజీ నగర్ సెక్షన్ ప్రాంతానికి చెందిన వారు 94910 52121కు కాల్ చేయాలన్నారు. వెస్ట్ సెక్షన్ కు సంబంధించి 949 0615134కు, సౌత్ సెక్షన్ కు సంబంధించి 9490615135కు కాల్ చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

ఇంటాక్ నూతన కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని మానస ఇన్ కార్యాలయంలో ఇంటాక్ నూతన కన్వీనర్ మానస చిన్నప రెడ్డిని ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఆదివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ చిన్నప రెడ్డి ఇంటాక్ కన్వీనర్ గా పదవి బాధ్యతలను చేపట్టిన హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

పెట్రోల్ ట్యాంకర్‌లో దిగి

ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి

- ఒకర్ని రక్షించబోయి మరొకరు మృతువాత

ప్రజాశక్తి-రాయచోటిటౌన్

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పట్టణంలో ఉన్న బషీర్‌ఖాన్ పెట్రల్ బంక్‌లోని ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా వైఎస్ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నెకు చెందిన ఇద్దరు, పెండ్లిమర్రికి చెందిన ఒకరు మృతిచెందారు. అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో నిరుపయోగంగా ఉన్న పెట్రోల్ ట్యాంకర్‌ను శుభ్రం చేసేందుకు సంబంధిత కంపెనీకి చెందిన కార్మికులు శివ (20), రవి (32), ఆనంద్ (40) గుంతలో దిగారు. వీరిలో మొదట రవి అనే వ్యక్తి ట్యాంకర్ గుంతలో దిగాడు. శుభ్రం చేస్తున్న తరుణంలో మరింత కిందకు జారిపడ్డాడు. అతన్ని కాపాడడం కోసం మరో వ్యక్తి ఆనంద్ దిగాడు. అతనూ కిందకు జారిపోవడంతో వీరిద్దరిని కాపాడేందుకు శివ అనే వ్యక్తి అందులో దిగాడు. ముగ్గురు ఊపిరి ఆడక ముగ్గురు మృతిచెందారు. వెంటనే రెస్క్యూ టీమ్ సాయంతో ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. 108 సాయంతో మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఊపిరాడక మృతిచెందిన కార్మికులు ఆనంద్, రవి, శివ

సామాజిక సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప

రాఘవయ్య శోభన్ బాబును పరామర్శిస్తున్న ఎపి ఎన్ఆర్‌టిఎస్ సభ్యులు

కువైట్ ఎపి ఎన్ఆర్‌టిఎస్ కో-ఆర్డినేటర్ సభ్యుల సామాజిక సేవలు అభినందనీయమని డైరెక్టర్ బి.హెచ్. ఇలియాస్ అన్నారు. రేణిగుంటకు చెందిన రాఘవయ్య శోభన్ బాబు 2018 న డిశంబర్‌లో జీవనోపాధి కోసం సముద్రం బోట్ల రిపేరు కోసం కువైట్‌కు వెళ్లారు. 2019 జూన్‌లో రోడ్డు దాటుతుండగా కారు ప్రమాదంలో తలకు దెబ్బతగిలి కోమాకు వెళ్లారు. సుమారు రెండేళ్ల తరువాత కోమానుంచి బయటకు వచ్చిన ఆయన్ను ఎపి ఎన్ఆర్‌టి డైరెక్టర ఇలియాస్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవయ్యశోభన్‌బాబును ఎపి ఎన్ఆర్‌టి చైర్మన్ మేడపాటి వెంకట్‌తో మాట్లాడి స్వదేశానికి తీసుకొస్తామన్నారు. రాఘవయ్య సోదరుడు మధు మాట్లాడుతూ తన తమ్ముడికి అండగా నిలిచిన ఎన్ఆర్‌టిఎస్ సంస్థ డైరెక్టర్, చైర్మన్‌కు, కన్వీనర్, సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు గోవిందు నాగరాజు, ఎం.వి. నరసారెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు మన్నూర్ చంద్రశేఖర్‌రెడ్డి, సలహాదారులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఏ.లాజరాజ్, మీడియా ఇన్‌ఛార్జి పి . సురేష్ రెడ్డి, రెడ్డయ్య, మణి , గోపాల్ రెడ్డి,శేఖర్, విజయ్ రెడ్డి, గడ్డం మోహన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - కడప

మోటర్ బైక్ వాహనదారులు హెల్మెట్ ధరించండి ప్రమాదాల బారి నుండి ప్రాణాలను రక్షించుకోండి అని ప్రముఖ యువ న్యాయవాది గౌస్ బాషా అన్నారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించండి అనే పోస్టర్లతో తో ఆదివారం నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆటోలకు హెల్మెట్ ధరించండి అని పోస్టర్లను అతికిస్తూ విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై ఫిర్యాదు

పోరుమామిళ్ల టౌన్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కించపరుస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు ఆదివారం సిఐ సురేష్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం ప్రకారం ఒక వ్యక్తిని కాని, కులం కానీ, మతాన్ని కానీ కించపరచడం, అగౌరవపరచే హక్కు ఎవరికీ లేదన్నారు. జన సైనికుల మనోభావాలు దెబ్బతినే విధంగా వైసిపి నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారని ఆరోపించారు. అలాంటి ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బసవి రమేష్, నందకిషోర్, రఘురాం, ఇమ్రాన్, వంశీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలో శాంతిభద్రతలు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. ఆదివారం ఎస్పి అన్బురాజన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గోటూరులో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్ఐ, పోలీస్ సిబ్బంది గ్రామంలోని గడ్డివాములు , గుడిసెల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవ్వరూ ఎటువంటి గొడవలకు పాల్పడకుండా ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవితాన్ని గడపాలని సూచించారు. గ్రామంలో ఎటువంటి చిన్న పాటి గొడవలు జరిగినా, ప్రేరేపించినా ఉపేక్షించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎఎస్ఐ మోహన్ రావు, హెడ్ కానిస్టేబుల్ కెఎంఎస్ రాజు , దేవ ప్రసాద్ , నిత్య పూజయ పాల్గొన్నారు.

గడ్డి వాములో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భారత సైన్యంలో సేవ చేయడం అదృష్టం

కలసపాడు : భారత సైన్యంలో చేరి సేవ చేయడం ఎంతో అదృష్టమని టూరిజంశాఖ రాష్ట్ర డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాజుపాలెంలో సుబేదార్ వీరంరెడ్డి సాంబ శివారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య తిథిగా హాజరై మాట్లాడారు. సరిహద్దుల్లో పనిచేయడం అది మన ప్రాంతానికే పేరు ప్రఖ్యాతలు అన్నారు. సైన్యంలో ఉండి సేవ చేసేటప్పుడు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ పోకల మల్లికార్జున రెడ్డి టూరిజం రాష్ట్ర డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి వైసిపి నాయకులు బోడిఎద్దుల ,బాల అంకిరెడ్డి (బాలుడు) సింగల్ రెడ్డి లక్ష్మిరెడ్డి, పోకల రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన 30 మంది విద్యార్థులకు ఆదివారం ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హుస్సేన్ బహుమతులు అందజేశారు. వారం రోజులుగా జన విజ్ఞాన వేదిక నాయకులు దాదాపీర్, గఫార్, ఖాసీమ్ వల్లినేతృత్వంలో విద్యార్థులకు పాటలు, కథలు, డ్రాయింగ్, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. నసిమున్, మోక్షిత, నజీరూన్, సబిహ, ఆలియా, మాహిన్‌తో పాటు పాల్గొన్న 30 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీర్ బాషా, ప్రకాష్ పాల్గొన్నారు.

పాఠకులకు మెరుగైన సేవలు

కడప అర్బన్ : ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న గ్రంథాలయాధికారులకు, సిబ్బందికి ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదేళ్లపాటు ఒకే చోట సర్వీసు పూర్తి చేసిన వారికీ బదిలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో చేరిన ఉద్యోగులు అందరు సమయపాలన పాటించాలని తెలిపారు. గ్రంథాలయాల్లో రికార్డులు ఎప్పటికప్పుడూ నమోదు చేయాలని, పాఠకులకు మెరుగైన సేవలు అందిచాలని కోరారు. బదిలీల కౌన్సెలింగ్ నిర్వహణలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దిన్, సీనియర్ అసిస్టెంట్ యల్. శ్రీనివాసా చారి పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధించాలి

కడప అర్బన్ : బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం సాధించాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గుర్రప్ప కోరారు. ఆదివారం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బిఎస్‌పి కార్యాలయం ఆవరణలో జిల్లా అధ్యక్షులు డి.ఎస్. జయరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్, జిల్లా ఇన్‌ఛార్జి స గిలి గుర్రప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి పార్టీ కార్యకర్తలు సందర్శిస్తామన్నారు. వారందరినీ బహు జన సమాజ్ పార్టీ వైపు మళ్ళించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, ఉపాధ్యక్షులు బాలచంద్ర, మైదుకూరు అసెంబ్లీ అధ్యక్షులు నాగా ర్జున, బద్వేల్ అసెంబ్లీ అధ్యక్షులు గౌస్ పీర్, మైదుకూరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కిరణ్ యాదవ్, కోశాధికారి చెన్నయ్య, కన్వీనర్ వీరాంజనేయరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కార్పొరేట్' యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్ : అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో పిడియస్‌యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే 50 శాతం పైగా అడ్మిషన్లు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు.

అచ్చెన్నాయుడును కలిసిన లక్ష్మీరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్


అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న లక్ష్మీరెడ్డి

టిడిపి నాయకులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ అలంకాన్ పల్లె లక్ష్మీ రెడ్డి ఆదివారం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అచ్చం నాయుడును ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరం మహానాడులో కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ కోసం విస్తృతంగా పోరాటాలు చేయాల్సి వస్తుందని సూచించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరుగుతున్న దౌర్జన్యం, అన్యాయాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మన్మోహన్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, జయరాం రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలి

- ఎస్‌టి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు హనుమంతు నాయక్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నారా లోకేష్ యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి ఎస్‌టి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బుక్కే. హనుమంతు నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జమ్మలమడుగు నుంచి 111వ రోజు పాదయాత్ర మళ్లీ ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో యువగళం యాత్రతో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలం దరికీ అందడం లేదన్నారు. అభివృద్ధి కూడా కుంటుపడిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానికంగా భూపేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎస్‌టిను కోరుతున్నామన్నారు.

టిడిపి అధికారంలోకొస్తే వ్యవసాయానికి పెద్దపీట

- జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి అధికారంలోకి వస్తే వ్యవసాయానికి పెద్దపీట వేస్తారని ఆ పార్టీ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున అన్నారు.

ఆదివారం మల్లికార్జున మాట్లాడుతూ పెద్దముడియం, మైలవరం, జమ్మల మడుగు మండలాల్లో శనగ పంట అధికంగా పండిస్తారని, అయితే గిట్టు బాటు ధరలేక రైతులు గోడౌన్లలో శనగలను నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. అలాగే పత్తి, మిరప ఇతర పంటల రైతులకు టిడిపి భవిష్యత్తులో అండగా ఉంటుందన్నారు. టిడిపి అధికారంలోకి రావడానికి కేవలం ఏడాది మాత్రమే ఉందన్నారు. యువగళం పాదయాత్రతో లోకేష్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తున్నారన్నారు. జమ్మలమడుగులో వైసిపిని ఎదుర్కోవడం ఒక్క భూపేష్‌రెడ్డికి మాత్రమే సాధ్యమన్నారు. భూపేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకొని తీరుతామన్నారు.

ఉపాధ్యాయులను మినహాయించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

2015 ఉపాధ్యాయులను ప్రస్తుత బదిలీల నుండి మినహాయించాలని ఎస్‌టియు జమ్మలమడుగు అధ్యక్షులు ఎస్.ఎం.డి గౌస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల నుండి 2015లో నవంబర్లో పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులను లాంగ్ స్టాండింగ్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఏడున్నర సంవత్సరాలు మాత్రమే సర్వీసు పూర్తయినప్పటికీ విద్యాసంవత్సరాల పేరుతో వారికి 8 సంవత్సరాలు పూర్తయినట్లుగా ప్రకటించి, వారిని తప్పనిసరి బదిలీలోకి చేర్చడం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. స్టేషన్ పాయింట్లు కేటాయింపులో కూడా నిర్దిష్ట విధానాలను అనుసరించకపోవడం వల్ల ఉపాధ్యాయులకు పాయింట్ల కేటాయింపులో భారీ వ్యత్యాసాలు ఏర్పడి, సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. బదిలీల కోసం కొన్ని నెలల వ్యవధిలో ప్రభుత్వం జిఒ 187, 47 విడుదల చేయడంలో గందరగోళం నెలకొందన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలన్నీ పరిష్కరించిన తర్వాత బదిలీలు నిర్వహించాలని ఆయన సూచించారు.

ఉచిత వడుగుల కార్యక్రమానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మందులు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

పట్టణ పరిధిలోని దొండపాడు రోడ్డులోని మసీదులో మస్జిద్-హిదాయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వడుగులు (ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 25 మంది ముస్లిం, నూర్ బాషా చిన్నారులకు డాక్టర్ ఆజాద్ సహకారంతో ఉచిత వడుగులు చేసినట్లు కమిటీ అధ్యక్షులు కమల్ బాష తెలిపారు. వడుగులు చేయించుకున్న చిన్నారులకు మందులు, ఐదు కేజీల గోధుమపిండి, ఒక కేజీ నూనె, బ్రెడ్ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, కొత్త దుస్తులు ఉచితంగా అందజేశారు. వడుగులు చేయించుకున్న వారు మస్జిద్-హిదాయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహమ్మద్ షరీఫ్, కమల్‌బాష, ఆబిద్ హజరత్, చాంద్ బాషా, జుబేర్ షా, బాషావల్లి, ఇంతియాజ్ పాల్గొన్నారు.

తలసేమియా బాధితునికి రక్తదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

రక్తదానం చేస్తున్న గురుశేఖర్

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చంద్రకు ఆదివారం బి పాజిటివ్ రక్తం అవసరం కాగా, వారు అమ్మ సేవా సమితి వాగ్దాడం శివ శంకర్‌ను సంప్రదించారు. ఆ మేరకు ఆయన సంస్థ సభ్యులు గోనిగుంట్ల గురుశేఖర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కడప శాఖ బ్లడ్ బ్యాంక్‌లో తన బి పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో వాగ్దాడం శివశంకర్, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ ప్రశాంతి పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని సెల్ టవర్ ఎక్కిన భర్త

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని నగిరిగుట్టకు చెందిన సంతోష్ అనే వ్యక్తి తన భార్య కాపురానికి రాలేదని సెంటెన్స్ పాఠశాల పక్కన ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మేరీ అనే మహిళను ప్రొద్దుటూరుకు చెందిన సంతోష్ అనే వ్యక్తికిచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే సంతోష్ తన భార్య మేరీతో తరచూ గొడవ పడుతూ ఉండడంతో, ఆమె తొమ్మిదేళ్ల క్రితం పులివెందులలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ విషయమై పెద్ద మనుషుల పంచాయితీతో సంతోష్, మేరీ పులివెందులలో సంసారాన్ని పెట్టారు. అయితే సంతోష్ వ్యవహారం మారకపోవడంతో మేరీ అమ్మ ఇంట్లోకి రానివ్వడం లేదు. సెల్ టవర్ ఎక్కిన విషయం తెలుసుకున్న ఎస్ఐ హుస్సేన్ సంఘటనాస్థలం వెళ్లి సంతోష్‌కు నచ్చచెప్పి, చాకచక్యంగా కిందికి దింపి పోలీస్‌స్టేషన్‌కు తర లించారు. అనంతరం పోలీసులు సంతోష్, మేరీ, మేరీ తల్లికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రైతు ఆత్మహత్యాయత్నం

- అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పెద్దముడియం మండలంలోని నాగరాజుపల్లె గ్రామానికి చెందిన చిన్నపరెడ్డి నారాయణరెడ్డి అనే రైతు విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వెంటనే గమనించిన నారాయణరెడ్డి బంధువులు జమ్మల మడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని నారాయణరెడ్డి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఈ సంఘటనకు కారకులైన విద్యుత్ అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు భరత్‌రెడ్డి, చంద్రమౌళి, వేణు యాదవ్, నాయకులు, పాల్గొన్నారు.

రైతు ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఈ అవస్థలు తప్పేదెన్నడో..!

- రైల్వేగేట్‌తో ప్రయాణికులు, ప్రజలకు తిప్పలు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేగేట్ పదేపదే వేస్తుండడంతో ప్రయాణికులు, ప్రజలు తిప్పలు పడుతున్నారు. బెంగళూరు, పులివెందులకు చెందిన వాహనదారులు ముద్దనూరు మీదుగా జమ్మలమడుగు, కర్నూలు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు బస్సులు, కార్లలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. గండికోట పర్యాటక ప్రదేశాన్ని వీక్షించేందుకు బెంగళూరు నుండి పర్యాటకులు కార్లు, బైకుల్లో వెళుతుంటారు. అయితే గేటు పదేపదే వేస్తుండడం వల్ల కార్లు, బైకులు, ఆటోలు రైలు వంతెన కింద వెళ్లేవారు. ప్రస్తుతం వంతెనకు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ఆ దారి నుంచి ప్రయాణించలేరు. వర్షాలు వస్తే వంతెన కింద నీరు నిలుస్తుంది. రైల్వేగేట్ తీసేందుకు దాదాపు 15, 20 నిమిషాల వరకు వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఫ్లై ఓవర్ ఊరికి దూరంగా ఉండడంతో అటుగా వెళ్లలేదు. దాదాపు 2,3 కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన ఉంటుంది. వేసిన గేట్ రెండు, మూడు రైళ్లు వెళ్లే వరకు గేటు తీయకపోవడంతో వాహనదారులు, ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గేట్ వేయడంతో బారులు తీరిన వాహనాలు

అసాంఘిక శక్తులను తరిమేస్తాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నగిరిగుట్టలో తిరుగుతున్న పోలీసులు

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యక్తులను తరిమేస్తామని పులివెందుల డిఎస్పి వినోద కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం పట్టణ పరిధిలోని నగిరిగుట్టలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వహిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న అల్లరి మూకలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. వారం రోజుల వ్యవధిలో నగరిగుట్టలో రెండు ఘర్షణలు ఆర్థిక లావాదేవీలతో జరిగాయని పోలీసులు తెలిపిన విషయం తెలిసిందే.. అయితే సోషల్ మీడియాలో అసాంఘిక కార్యక్రమాలు మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్ వల్ల జరిగిందని జోరుగా ప్రచారం సాగింది. దీంతో పోలీసులు హెచ్చరించడం కోసం సిబ్బందితో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రాజు, రూరల్ సిఐ మద్దిలేటి, పులివెందుల, లింగాల, తొండూరు, వేముల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్న దండ్లూరు గ్రామంలో ఆదివారం కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తమ సిబ్బందితో కలిసి నాకాబంది నిర్వహించారు. పోలీసులు గ్రామంలోని ప్రతి ఇంటిని, అనుమానాస్పద స్థలాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ఫ్యాక్షన్‌ను వీడి ప్రశాంత జీవితాన్ని గడపాలని గ్రామస్తులను కోరారు. ఎస్పి ఆదేశాల మేరకు ఎస్ఐ సంజీవరెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్నపాటి గొడవలు జరిగినా, గొడవలు జరిగేలా ప్రేరేపించినా ఉపేక్షించేది లేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ సంజీవరెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

రైతుకు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

ఎన్నో ఏళ్లుగా వేలాది మంది రైతులకు సమస్యగా ఉన్న చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపు నిర్ణయం రైతులకు వరంలాంటిదని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్ కళ్యాణమండపంలో మండల పరిధిలోని 3,755 మంది రైతులకు సంబంధించి 3,623 ఎకరాలు చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు పత్రాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1916 సంవత్సరం నుంచి నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములకు సిఎం జగన్ విముక్తి కల్పించారని తెలిపారు. చుక్కల భూములతో రాష్ట్రంలో వేలాది మంది రైతుల ఇబ్బందులు తొలగిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.06 లక్షల మందికి లబ్ధి చేకూరేలా సిఎం జగన్ మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తోందన్నారు. జెసి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చుక్కల భూములకు సంబంధించి జీవో నెంబర్ 152 విడుదల చేసిందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములను తొలగించడం వలన ఇక మీదట క్రయవిక్రయాలు చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. చుక్కల భూములు కలిగిన రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను రెవెన్యూ సిబ్బందికి సమర్పించి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆన్‌లైన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. రెవిన్యూ చరిత్రలో ఇది ఒక చెప్పుకోదగ్గ మార్పు అని ఆయన కొనియాడారు. అనంతరం రైతులు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ సుభాని, ఎంపీపీ టి.లక్ష్మమయ్య, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్ నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, జిల్లా రైతు సలహా మండలి సభ్యులు నారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

కేక్ కట్ చేస్తున్న భూపేష్ రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మద్యపాన నిషేధం చేస్తామని రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చి అమలు చేసిన ఘనత దేశ చరిత్రలో ఎన్‌టిఆర్ ఒక్కరే అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర నూతన టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్య ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, భారీ ఎత్తున కేక్ కట్ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తాను టిడిపిలో ఉండి ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు మీ అందరి సమక్షంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న గొప్ప నాయకులు ఎన్‌టిఆర్ అని పేర్కొన్నారు. ఆయన తెలుగు భాషకు ప్రాముఖ్యత తెచ్చారన్నారు. ఎన్‌టిఆర్ అడుగుజాడల్లో క్రమశిక్షణతో తన కుమారుడు భూపేష్‌రెడ్డి నడిచి జమ్మలమడుగు ప్రజల మన్నలను పొంది, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మీ అందరి సహకారంతో ముందుకు పోతారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండల అధ్యక్షులు దేవగుడి యూత్ నాగేశ్వర రెడ్డి, పాపిరెడ్డి, రామసుబ్బారెడ్డి, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెబోయిన కొండయ్య యాదవ్, టిడిపి జిల్లా కార్యనిర్వహకులు పొన్నతోట శ్రీనివాసులు, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు మల్లికార్జున, జిల్లా మైనార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ రఫీ, కళాయి గిరి ఖదీర్, ఎస్టీ సెల్ హనుమంతు నాయక్, భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : ప్రజల ఆకలి దప్పికలు తీర్చిన గొప్ప సంఘసంస్కర్త ఎన్టీ రామారావు అని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు అక్బర్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మన్నూర్ అక్బర్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ ఒకేసారి సాధించవచ్చునని నిరూపించిన పాలన ఎన్టీఆర్ కే దక్కిందని చెప్పారు ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ జాకీరుద్దీన్, తెలుగు యువత ఉపాధ్యక్షులు సయ్యద్ రహిమాన్, మైనారిటీ నాయకులు రూపనగుడు హుస్సేన్, చాను నివాళి అర్పించారు.

ఎన్‌టిఆర్‌కు భారతరత్న బిరుదు ఇవ్వాల్సిందే : రెడ్యం

ఖాజీపేట : టిడిపి స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డు సృష్టించడం, భారతదేశ చలనచిత్ర రంగంలో ఏ ఒక్కరూ నటించని పాత్రలలో నటించి మెప్పించడం ఒక్క నందమూరి తారక రామారావుకే సాధ్యమైందని టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్‌నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం ఆయన దుంపలగట్టులోని తన స్వగృహంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌కు భారతరత్న బిరుదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్యం సతీమణి, తెలుగు మహిళా మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి రెడ్యం లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

వేంపల్లె : ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా పేదలకు, తోపుడు బండ్ల కార్మికులకు టిడిపి నాయకులు పండ్లు పంపిణీ చేశారు. వేంపల్లె, వేముల నుండి మహానాడుకు వెళ్లిన టిడిపి నాయకులు కొవ్వూరు నియోజకవర్గంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నాయకులు కృష్ణారెడ్డి, దొంతు సుబ్బారావు, గొటూరు నాగభూషణం, భాస్కర్‌రెడ్డి, వెంకటస్వామి, వేముల మండల కన్వీనర్ బ్రహయ్య, ఓబుల్ యాదవ్, బాలస్వామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, బాబయ్య పాల్గొన్నారు. టిడిపి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి సీనియర్ నాయకుడు మాజీ ఎంపిటిసి సంటెన్న పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా ఆదివారం స్థానిక షబ్బీర్ కార్యాలయం, టిడిపి కార్యాలయంలో ఘనంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. టిడిపి నాయకులు పివి రమణ, ఎద్దుల కొండ్రాయుడు, మోహన్‌రెడ్డి, షరీఫ్, ఇలియాస్, అల్లాబకష్, ఈశ్వరయ్య, డక్కా రమేష్, జబిబుల్లా, మల్లికార్జున, మహమ్మద్, గండికోట వెంకటశివ, మాజీ సర్పంచ్ శ్రీరామిరెడ్డి, భాస్కర్, బాలం వెంకటసుబ్బయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కడప అర్బన్ : ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మన్నూరు అక్బర్

మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని మెప్మా కార్యాలయంలో ఆదివారం ప్రపంచ రుతుస్రావ పరిశుభ్రత వారోత్సవాలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనాథ్ మాట్లాడుతూ రుతుస్రావం అనేది మహిళల్లో ఏ వయసు వారికి వస్తుంది.. తీసుకోవలసిన జాగ్రత్తలు.. జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన వచ్చు అనారోగ్య సమస్యల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక వేంపల్లి రోడ్డులో మహిళలతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్సీ సూపర్వైజర్ ఓబులేసు, మెప్మా సిఐలు వసంతరెడ్డి, విమల, మెప్మా ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పులివెందుల రూరల్ : పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. బావర్చి రెస్టారెంట్ వారి సౌజన్యంతో మాస్టర్ టి.యువకిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల శిష్య బృందంచే జానపద, శాస్త్రీయ, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో బావార్చి రెస్టారంట్ శ్రీకాంత్, పరిపాలనా అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, డ్యాన్స్ మాస్టర్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణకిషోర్

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని లైబ్రేరియన్ కృష్ణకిషోర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పురాణ గాథలు చెప్పడం, చిత్రలేఖనం తరగతులను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వనజ కుమారి కోరారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు కథలను బోధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులు వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయని, వాటిని చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా చేసేందుకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో నీతి కథల బోధన, పుస్తక సమీక్ష వంటి అంశాలకు తోడు యోగా శిక్షణ, చిత్ర లేఖనంలో మెళకువలు నేర్పడం, పేపర్ క్రాఫ్ట్ తయారీ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

నేడు సీజ్ చేసిన వాహనాలకు వేలం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సోమవారం వేలం వేస్తున్నట్లు ఆశాఖ సిఐ రామాంజనేయులు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ప్రభుత్వం నిబంధనల మేరకు, తమ ఆధార్‌కార్డు, ధారావత్తు పైకం స్టేషన్‌లో సోమవారం చెల్లించాల్సి ఉందన్నారు.

రేపు జమ్మలమడుగులో..

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 30న వేలంపాట నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కెవిఎస్ లత ఒక ప్రకటనలో తెలిపారు. వేలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు ఏదైనా ప్రూఫ్ తీసుకొని వేలంలో పాల్గొనవచ్చు అని ఆమె సూచించారు.

నేడు వైసిపి నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

3వేల బైక్‌లతో మైదుకూరు నియోజకవర్గంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు మేనిఫెస్టో ప్రకటించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టిందన్నారు. టిడిపి ప్రజలకు చేసిన మోసాన్ని గుర్తు చేసేందుకు ఈ నిరసన ర్యాలీ చేపడుతున్నామన్నారు. ర్యాలీ సోమవారం పాత దువ్వూరులోని కోదండ రామాలయం నుండి ప్రారంభమై గుడిపాడు-చింతకుంట-మైదుకూరు మీదుగా ఖాజీపేటలోని కెసి కెనాల్ బంగ్లా వరకు నిర్వహి స్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీపీ టి.లక్ష్మమ్మయ్య, వైసీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, పార్టీ నాయకులు వినయ్ కుమార్‌రెడ్డి, రామచంద్రయ్య, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వూరు : టిడిపి ప్రభుత్వం మేనిఫెస్టోలోని అంశాలు అమలకు నోచుకోనందుకు నిరసనగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బైక్ ర్యాలీ ఉంటుందని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. పాత దువ్వూరు కోదండ రామాలయం నుండి బైక్ ర్యాలీ ప్రారంభమై గుడిపాడు, చింతకుంట, మైదుకూరు మీదుగా ఖాజీపేటలోని కెసి కెనాల్ బంగ్లా వరకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'మానవత' ఆర్థిక చేయూత

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న నల్లబల్లె రఘునాథ్ అనే వ్యక్తి గుండె జబ్బుతో బాధపడుతుండగా.. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో ఆదివారం రూ. 15వేలు ఆర్థికసాయం చేశారు. మానవత స్వ చ్ఛంద సంస్థ నెలవారి సమావేశం స్థానిక గౌతమ్ హైస్కూల్‌లో నిర్వ హిం చారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మానవత సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, జిల్లా ఉపా ధ్యక్షులు రమణారెడ్డి, మండల అధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మాంసం ధర పట్టికను ఏర్పాటు చేయాలి

పులివెందుల రూరల్ : పురపాలిక పరిధిలో మాంసం అమ్మే వారు ధర తెలిపే పట్టికను విధిగా ఏర్పాటు చేయాలని కమిషనర్ వివి నరసింహారెడ్డి సూచించారు. ఆ మేరకు ఆదివారం ఆయన అధికారులతో కలిసి మాంసం విక్రయించే దుకాణాలను పరి శీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శుక్రవారం మునిసిపల్ మాంసపు అంగళ్ల యజ మానులతో సమావేశం నిర్వహించామని, విక్రయ దారులు కిలో మాంసం రూ.650 అమ్మాలని చెప్పామన్నారు. ఇందుకు విక్రయదారులు మాట్లాడుతూ జీవాల్లోని అన్ని భాగాలను కలిపి ఆ ధరకు మంగళవారం నుంచి విక్రయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి - కడప అర్బన్

రిమ్స్ ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కడప నుంచి రిమ్స్ ఆస్పత్రి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరి పైకి టిప్పర్ టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారు వృత్తిరీత్యా డ్రైవర్లు. చెన్నూరు మండలం చిన్న మాచు పల్లె చెందిన యాకోబ్ (35) రిమ్స్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న తన సోదరిని చూసేందుకు, కడప నగరం కాగితాల పెంటకు చెందిన షేక్.ముబారక్ (24)తో కలిసి ద్విచక్రవాహనంపై రిమ్స్‌కు బయలుదేరాడు. అదే సమయంలో రిమ్స్ నుంచి టిప్పర్ వాహన మట్టితో కడపకు వస్తుండగా శివానందపురం సమీపంలోని బొరుగుల ఫ్యాక్టరీ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో ఇద్దరిపైనా టిప్పర్ టైర్లు ఎక్కడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. యాకోబుకు భార్య అపర్ణతో పాటు పాప ఉంది. ఈ ఘటనపై రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పోలీస్ సిబ్బందిపై దాడికి యత్నించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పెన్నా నది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించిన ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, సిబ్బందిపై దాడికి యత్నించిన అనంతపురం గ్రామానికి చెందిన గండు రాజును ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ వివరాలు ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున అక్రమ ఇసుక ట్రాక్టర్ల తనిఖీలో భాగంగా మోహన్‌రెడ్డి తన సిబ్బంది దాడులు చేపట్టగా.. అనంతపురం గ్రామానికి చెందిన గండు వెంకటరమణ అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్లు నిలిపే ప్రయత్నించగా, ఆపకుండా వేగంగా వెళ్లి ఇసుకను పొలాల్లో దింపేసి ఇంటికి వెళ్లిపోయాడు. ట్రాక్టర్‌ను వెంబడించిన పోలీస్ సిబ్బంది అతని ఇంటి వద్దకు వెళ్లగా వెంకటరమణతోపాటు అతని సోదరుడు రాజు వారిపై దాడికి ప్రయత్నించి నోటికి వచ్చినట్లు తిట్టారన్నారు. ఎస్‌బిఇ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రాజును అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 మే 2023

నేడు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు.అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి అంకిత భావంతో కృషి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పుంగనూరు పర్యటనలో భాగంగా వాల్మీకిపురం పట్టణానికి చెందిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, జిల్లా వక్ఫ్ కమిటీ అధ్యక్షుడు కరీముల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి హజ్ యాత్రికుల సమస్యల పరిష్కారానికి సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హజ్ యాత్రికులపై కేంద్రం మోపిన అదనపు భారాన్ని మినహాయించాలని కేంద్ర పెద్దలతో చర్చించేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎంపీ మిథున్ రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజం నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని పంపినట్లు తెలిపారు. ప్రత్యేక బృందం ద్వారా చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో హజ్ యాత్రికులపై అదనంగా ఎలాంటి భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తుందని జగన్మోహన్ రెడ్డి పెద్ద మనసుతో అంగీకరించి వెసులుబాటు కల్పించారన్నారు. టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరిని అవలంభించారని, మంత్రివర్గంలో కనీసం ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేకుండా నాలుగున్నర ఏళ్ల పాట్లు పాలన సాగించారని, ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు మైనార్టీలపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని, మైనార్టీలు చంద్రబాబును నమ్మే పరిస్థితి లేరని పేర్కొన్నారు. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలోనే జగన్మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి అంకిత భావంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జిలాని, సాహెబ్ , ఆబిద్, ఫయాజ్, మౌలానా, సాదిక్ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న అబ్దుల్ కలీమ్, హబీబ్‌బాషా

వక్ఫ్‌బోర్డు అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తామని, బోర్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ. కరిముల్లా పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా, పుంగనూరుకు విచ్చేసిన మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరిముల్లా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని, మసీదులు, ఈద్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. ఎస్.ఎ.కరీముల్లా మాట్లాడుతూ ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పర్యటించి వివిధ మసీదులు, దర్గాలను సందర్శించామని చెప్పారు. వక్ఫ్ బోర్డు ద్వారా వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అమ్ము, ఏపీ స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్ ఖాదర్ బాషా, కౌన్సిలర్ ఖాజా, వసీం పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకపోతే పోరాటలకు సిద్ధం

విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు కర్నూల్ అంజి

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విఆర్ఎలకు ఇచ్చిన హామీలు పరిష్కరించకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకులు కర్నూలు అంజి హెచ్చరించారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో కడప రెవెన్యూ డివిజన్ మండలాల విఆర్ఎల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వెంకటపతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ అంజి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తున్న సందర్భంలో, విజయవాడ అలంకార్ సెంటర్లో దీక్షలు చేస్తున్న సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు పెంచుతానని, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్న విఆర్ఎల సమస్యలు ఒకటి కూడా పరిష్కరించక పోగా ఉన్న జీవోలోనే కోత పెడుతున్నారని వాపోయారు. పైగా ఒక్కో విఆర్ఒ నుంచి రూ.19,500 రికవరీ చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నామినీగా ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్నా రెగ్యులర్ కాకపోవడం, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయక విద్యా అర్హత ఉండి కూడా ఉద్యోగోన్నతి లేకపోవడంతో అయోమయ పరిస్థితిలో విఆర్ఎలున్నారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామ సేవకులకు పే స్కేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రమోషన్లు కల్పిస్తూ విఆర్ఎల జీవితాల్లో వెలుగు నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కన్నా మిన్నగా చేస్తామని చెప్పిన జగన్మోహన్ రెడ్డి తక్షణమే విఆర్ఎలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటానికి వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ నాగేంద్ర, అన్నమయ్య జిల్లా కో- కన్వీనర్ భోగేశ్వరయ్య, కడప రెవెన్యూ డివిజన్ నాయకులు రమణ,అశోక్,శివ,రజినీ కాంత్, కిశోర్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, ఓబులేసు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక :

కడప రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా రమణ, కార్యదర్శిగా అశోక్ డివిజన్ నాయకులుగా శివ, రజినీ కాంత్, కిశోర్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, ఓబులేసుతోపాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు అంజి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

విదేశీ పర్యటనకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న మానవత సభ్యులు

సమాజ సేవే లక్ష్యం : 'మానవత'

ప్రజాశక్తి- రాయచోటి

సమాజ సేవ లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు పనిచేస్తున్నామని జిల్లా టూరిజం అధికారి నాగభూషణం , మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి పేర్కొన్నారు. ఆదివారం ప్రతిభా జూనియర్ కళాశాలలో జిల్లా మానవతా శాఖ చైర్మన్ అరమాటి శివగంగ రెడ్డి ఆధ్వర్యంలో మానవతా స్వచ్ఛంద సంస్థ నెల వారి సమావేశం నిర్వహించారు. అనంతరం విదేశీ పర్యటనకు వెళుతున్న మానవత మాజీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి మానవత సభ్యులు ఘనంగా సత్కరించారు. రాయచోటి మానవత శాఖ 2023-24 నూతన అధ్యక్షులుగా చింతం రెడ్డి వెంకట్రామిరెడ్డి (బాబు)ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగభూషణం, నాగార్జునాచారాని మానవత కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించి మానవత మెమోంటోను అందజేశారు సంబేపల్లి మండలం దుద్యాల గ్రామం మోపురం పల్లెకు చెందిన దొరబాబు అనే అన్నదాతకు జిల్లా డైరెక్టర్ ఆనంద రెడ్డి, మరో రైతుకు గౌరవ సలహాదారుడు బెల్లం లోకనాధ రెడ్డి ఆర్థిక సహాయంతో రూ.5,116 నగదు ప్రోత్సాహకంతో పాటు శాలువాతో సన్మానించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

30 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం కంటి వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, యర్రావారిపాలెం, కెవిపల్లి, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, పులివెందుల, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 70 మంది కంటి రోగులకు పరీక్షల నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 30 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు గతంలో ఆపరేషన్ చేయించుకున్న 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారికి సహాయంగా వచ్చిన వారికి కూడా భోజనం వసతి కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు మహాలక్ష్మి భార్గవి ఆప్మాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'ఆవేదనాకరం' పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక శాఖా గ్రంధాలయంలో ప్రముఖ రచయిత మూలగిరి, రంగన్న , ఎక్సైజ్ శాఖ విశ్రాంత డిప్యూటీ సూపరింటెండెంట్ రచించిన 'ఆవేద నాకరం' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. సీనియర్ కథా, నవలా రచయిత పి.వి.ప్రసాద్ చే ఆవిష్కరించి మొదటి ప్రతిని గ్రంధాలయ అధికారి వసం తకుమారికి,ద్వితీయ ప్రతిని మరో సీనియర్ రచయిత వి. యం.నాగరాజుకు అంద జేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రచయిత రంగన్న జీవితం అంద రికీ ఆదర్శమని, తమ జీవితంలోని వాస్తవ అనుభవాలను తమ రచనలో ప్రతిబి ంబింపజేశారని చెప్పారు. కార్యక్రమాన్ని ఆశాంతం మరో రచయిత పి. ఖిజర్ ఖాన్ వ్యాఖ్యతగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ అధికారి, రచయితలు

పెట్రోల్ ట్యాంకర్‌లో దిగి

ఊపిరాడక ముగ్గురు కార్మికులు మృతి

ఒకర్ని రక్షించబోయి మరొకరు మృతువాత

ప్రజాశక్తి-రాయచోటిటౌన్

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పట్టణంలో ఉన్న బషీర్‌ఖాన్ పెట్రల్ బంక్‌లోని ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా వైఎస్ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నెకు చెందిన ఇద్దరు, పెండ్లిమర్రికి చెందిన ఒకరు మృతిచెందారు. అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో నిరుపయోగంగా ఉన్న పెట్రోల్ ట్యాంకర్‌ను శుభ్రం చేసేందుకు సంబంధిత కంపెనీకి చెందిన కార్మికులు శివ (20), రవి (32), ఆనంద్ (40) గుంతలో దిగారు. వీరిలో మొదట రవి అనే వ్యక్తి ట్యాంకర్ గుంతలో దిగాడు. శుభ్రం చేస్తున్న తరుణంలో మరింత కిందకు జారిపడ్డాడు. అతన్ని కాపాడడం కోసం మరో వ్యక్తి ఆనంద్ దిగాడు. అతనూ కిందకు జారిపోవడంతో వీరిద్దరిని కాపాడేందుకు శివ అనే వ్యక్తి అందులో దిగాడు. ముగ్గురు ఊపిరి ఆడక ముగ్గురు మృతిచెందారు. వెంటనే రెస్క్యూ టీమ్ సాయంతో ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. 108 సాయంతో మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఊపిరాడక మృతిచెందిన కార్మికులు ఆనంద్, రవి, శివ

క్రీడలతో మానసిక ఉల్లాసం

- సీనియర్ సివిల్ జడ్జి దివాకర్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

యువత క్రీడల్లో రాణిస్తే మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయని కర్నూల్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ అన్నారు. ఆదివారం సొంతూరైన వాల్మీకిపురానికి విచ్చేసిన జడ్జి స్థానిక జివిఎస్‌సిఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ క్యాంపులో పాల్గొని, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిం చినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత ఉంటుందన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో ఆసక్తి చూపాలని సూచించారు. వాల్మీకిపురం నుంచి ఎంతో మంది క్రీడాకారులు క్రీడల ద్వారా ఉద్యోగాలు సంపాధించి, అనేక పదవుల్లో ఉన్నారని తెలిపారు. క్రీడల ద్వారా శరీరం కూడా తేలికగా, ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా అనారోగ్య సమస్యలు కూడా రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోచ్ సునీల్, సీనియర్ క్రీడాకారులు భరత్, షాహెద్ పాల్గొన్నారు.

క్రీడాకారులతో సీనియర్ సివిల్ జడ్జి దివాకర్

ముగిసిన హోమ్ ఎక్స్‌పో ప్రదర్శన

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఇంజినీర్స్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో మదనపల్లె అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోమ్ ఎక్స్‌పో-2023 (బిల్డింగ్ మెటీరియల్ ప్రదర్శన) మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలకు ఎంత గానో ఉపయోగమని స్థానిక ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. గత మూడు రోజులుగా నిర్వహించిన ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హోమ్స్ ఎక్స్‌పో కార్యక్రమం ఇక్కడ గృహ నిర్మాణాలు చేపట్టే వారికి అవసరమైన అన్ని రకాల వస్తువుల స్టాళ్లతో పాటు ఇంటీరియర్ డెకరేటింగ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి దాదాపు 30 వివిధ రకాల నిర్మాణ ,పనిముట్లను ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ మహేంద్ర బాబు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనలో పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తాము ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ రెడ్డి నాగరాజు , ఇసి సభ్యులు సురేష్ బాబు, పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా ఎటిఎం దొంగ అరెస్టు

- 27 గ్రాముల బంగారం , రూ.లక్ష నగదు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో పలు ఎటిఎం దొంగతనాలకు పాల్పడిన అంతరాష్ట్ర ఎంటిఎం దొంగ కొర్ర శ్రీకాంత్‌ను కడప వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్టు డిఎస్‌పి మహమ్మద్ షరీఫ్ తెలిపారు, కడప డిఎస్‌పి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరెస్టు చేసిన నిందితుడు అనంతపురం జిల్లా తనకల్లు మండలం ఏణుగుండ్ల తండాకు చెందిన వాడని తెలిపారు. అరెస్ట్ చేసిన అతని వద్ద నుంచి 27.500 గ్రాముల బంగారు నగలు, రూ. లక్ష నగదు, ఒక యమహా బైక్, 24 ఎటిఎం కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు, స్వాధీనం చేసుకున్న వాటి విలువ సుమారు రూ. రెండున్నర లక్ష ఉంటుందని తెలిపారు, నిందితుడిపై ఇప్పటికే గుత్తి, మదనపల్లి, అలిపిరి, అనంతపురం వన్ టౌన్ స్టేషన్లో కేసులున్నాయని తెలిపారు, నిందితుడు ఎటిఎంలలో అమాయకులను, వృద్ధులను మోసం చేసి డబ్బులు కాజేసేవాడని చెప్పారు. కడప జిల్లాలో అతనిపై కడప వన్ టౌన్ లో రెండు, ప్రొద్దుటూరు టూటౌన్ , నెల్లూరు వన్ టౌన్, కాళహస్తి వన్ టౌన్, చంద్రగిరి పోలీస్ స్టేషన్ లలో ఒక్కొక్క కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఎటిఎం కార్డులను మార్చి తర్వాత డబ్బులు డ్రా చేసుకునేవాడని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు మల్లయ్య, శీను క్రైమ్ పార్టీ పోలీస్ కానిస్టేబుల్ కిరణ్, నారాయణరెడ్డి, బాష, ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌ను డిఎస్‌పి రివార్డులతో అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మహమ్మద్ షరీఫ్

బెల్ట్ గ్రేడింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన క్రీడాకారులు

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు ఉందని, విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించగలిగితే క్రీడల కోటా ద్వారా యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఊటుకూరు ఎంపీటీసీ నాగ చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. ఆదివారం జిఎంసి కల్యాణ మండపంలో ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ ఆధ్వర్యంలో టైక్వాండో బెల్టు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరి అని సూచించారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల ఆరోగ్యం, మంచి శారీరక ఆకృతితో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం లభిస్తుందని తెలిపారు. ఆత్మరక్షణే మార్షల్ ఆర్ట్స్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తల్లిదండ్రులు మార్షల్ ఆర్ట్స్ పట్ల అవగాహన కలిగి పిల్లల్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. గ్రాండ్ మాస్టర్ సునీల్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగులో 18 మంది క్రీడాకారులు వివిధ రకాల బెల్ట్ గ్రేడింగ్‌లు సాధించారని తెలిపారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో ఉత్తీర్ణులైన క్రీడాకారులకు నాగ చంద్రశేఖర్ రెడ్డి బెల్టులతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, సంయుక్త కార్యదర్శులు ఉమాశంకర్, వర్ల నరసింహ, మాస్టర్లు కె.నాగరాజ, కె.గంగారాం, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు ఎస్. అల్లాబకాష్

రాష్ట్రపతిని అవమానించడం దురదృష్టకరం

ప్రజాశక్తి - రాయచోటి

పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించక పోవడం దురదృష్టకరం అని కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్. అల్లా బకాష్ సిఎల్‌పి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ చర్య రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతమని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పరిహాసించడమేననీ తెలిపారు. పార్లమెంటు అంటే రాష్ట్రపతి, లోక్ సభ, రాజ్యసభ లాంటివని ఇంటి యజమానికి సంబంధం లేకుండా గృహ ప్రవేశం చేసినట్లుందని చెప్పారు. భారత ప్రథమ పౌరురాలు, గిరిజన మహిళ ద్రౌపది ముర్మును బిజెపి అవమానించడం భావ్యమా అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తోందన్నారు. దేశ ప్రెసిడెంట్ పార్లమెంటు భవనాన్ని, ప్రారంభోత్సవం చేయక పోవడం పట్ల రాయచోటి కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందన్నారు. ప్రెసిడెంట్ ఒక గిరిజన మహిళ అయినందున ఆమెతో ప్రారంభోత్సవం చేయనీయకుండా ,అగ్రవర్ణ దురహంకార ధోరణి , ఆర్ఎస్ఎస్ బావా జాలం బయట పడిందని విమర్శించారు. ఇలాంటి దేశ వ్యతిరేక విధానాలను ఇంకిత జ్ఞానం లేని ప్రధాని మనకు ఉండటం సిగ్గుచేటుని వాపోయారు. ఏదో ఒక రోజు ప్రధాని భారీ మూల్యం చెల్లించుకోక తప్పదున్నారు. దేశ ప్రజలు ప్రధానిని అతని నిరంకుశ విధానాలను పాతాళానికి తొక్కే రోజు వస్తుందన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఖదీర్, రాయచోటి పట్టణ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, దినకర్ షారుక్ పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

రాజంపేట అర్బన్ : అన్నదానం మహా దానమని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా తెలియజేశారు. అంతర్జాతీయ ఆకలి దినోత్సవం సందర్భంగా రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఆధ్వర్యంలో రాజంపేట పట్టణం లోని యాచకులకు, పేదవారికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఖాదర్ బాష మాట్లాడుతూ ఆకలి రుచి కోరదు, శుచి చూడదని, ఆకలి గొన్న వారు దొరికిన పదార్థం తోనే తృప్తి చెందుతారని తెలిపారు. ఆహారాన్ని వృథా చేయకుండా పేదవారికి ఆహారం పంచడం వల్ల వారి ఆకలి తీర్చిన వారు అవతారన్నారు. అంతర్జాతీయ ఆకలి దినోత్సవం సందర్భంగా పేదవారికి ఆహారాన్ని పంచడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి, వాలంటీర్లు నాగస్రాల శ్రీనివాసులు, వక్కల సుధాకర్ పాల్గొన్నారు.

తారు రోడ్డుగా మారేదెన్నడో?

వర్షం పడితే చిత్తడే చిత్తడి.. ఏడు గ్రామాల ప్రజల ఆందోళన

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎగువమాలపల్లి వరకు వెళ్లే మట్టి రోడ్డు తారురోడ్డుగా మారేదెన్నడోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థానిక ప్రజా ప్రతినిధులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు చర్చించు కుంటున్నారు. కొత్తద్దేపల్లి, రవీంద్రరెడ్డికాలనీ, పోచంపల్లి ఎగువమాలపల్లి, చాకలపల్లి, కుమ్మరపల్లి, చీకటపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు వాహనాలు, కాలినడక ఈ మట్టిమీద నుంచే సుండుపల్లికి ప్రయాణిస్తుంటారు. వర్షం పడినప్పుడు రోడ్డంతా చిత్తడిగా మారి ప్రమాదానికి నిలయంగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ఆ గ్రామాల కోరుతున్నారు.

వర్షంతో చిత్తడిగా మారిన మట్టిరోడ్డు

తారురోడ్డు వేయాల్సిందే

మట్టిరోడ్డు నుంచి సుండుపల్లికి వెళ్లాంటే ప్రయాణించాలంటే ఏడు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరం. రోడ్డు గుంతలు గుంతలుగా చేసి వది లేయడం సరికాదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

- బండిఈశ్వర్, మాల మహానాడు రాష్ట్రఅధ్యక్షులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు : ఎమ్మెల్యే

విజేత జట్లకు ట్రోఫిని అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి

రాష్ట్రస్థాయి పోటీలను సుండుపల్లి లాంటి మారుమూల మండలంలో నిర్వహించడం అభినందించదగ్గ విషయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. అంతర్ జిల్లాల 10వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడలతో భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, క్రమశిక్షణతో ఆడి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో మొదట స్థానంలో నిలిచిన గెలుపొందిన కడప జిల్లా బాలికల జట్టును, విజయనగరం బాలుర జట్టును అభినందించారు. గెలిచిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. మరింత గొప్పగా ఆడి దేశం గర్వించే విధంగా ఎదగాలని ఆయన అన్నారు. సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టోర్నీ జరగడానికి సహకరించిన స్థానిక శాసన సభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వచ్చిన ఆటగాళ్ళకు,టీం నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేసిన ఎమ్మెల్యే మేడా వద్యానతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శతజయంతి వేడుకలను ఆదివారం బి.కొత్తకోట జ్యోతి చౌక్‌బస్టాండ్‌లో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్‌తాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు, పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయం, ఆయన యిచ్చిన స్ఫూర్తితో పార్టీ నాయకత్వం ముందుకెళ్ళి నెరవేర్చినప్పుడే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. తెలుగువారి కీర్తిని ప్రపంచం నలుదిశల చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. మహిళలకు ఆస్తిలో సమభాగం హక్కు కల్పించి, మహిళలు విద్యారంగంలో ముందుండాలని మహిళా యూనివర్సిటీని స్థాపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూతనిచ్చింది టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, చంద్రశేఖర్, శంకర, సుధాకర, వేమారెడ్డి వెంకట్రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కెవిఆర్, సుబ్బమ్మ,పెద్దమ్మ, నరసింహులు, పూలబాబు, యస్.మస్తాన్ రెడ్డి, దయ్యాలపల్లి శివారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడలో నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ఆశాజ్యోతి తెలుగు ప్రజల గుండెల్లో గూడు కొట్టుకున్న మహనీయుడు నందమూరి తారక రామారావు పుట్టి వంద సంవత్సరములు పూర్తయ్యాయని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి మల్లారపు రవిప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్ ఛార్జి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ విశ్వనాథ, కలకడ టౌన్ ఇన్‌ఛార్జి ఎల్లమంద జిలానిబాషా, జనార్ధన్ నాయుడు, వెంకట రమణ (పెద్దోడు), ఈశ్వరయ్య, మల్లి కార్జున, మునాఫ్, కరీముల్లా, ఇమ్రాన్, జిరాక్స్ అల్లి, ఇర్ఫాన్, ఖాజా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, నౌషాద్ పాల్గొన్నారు. **రాయచోటి:** ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా ఉమ్మడి కడప జిల్లాలో నందమూరి తారక రామా రావుతో కలిసి పని చేసిన వారిని గుర్తు చేసుకుంటే మొదటగా మనకు గుర్తు వచ్చే పేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ రాయుడు . నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో 30 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా,ఎంపీగా విజయ ఢంకా మోగించిన సుగవాసి పాలకొండ రాయుడు పేరు రాష్ట్రంలో తెలియని వారు ఉండరు. ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా పాలకొండరాయుడు ఎన్‌టిఆర్‌కు ఘనమైన నివాళులర్పించారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల్లో పాటు వైభవంగా జరుగుతున్న మహానాడు పండుగ కార్యక్రమానికి సుగవాసి ప్రసాద్ బాబు హాజరై ఎన్టీఆర్ శతజయంతోత్సవాలలో పాల్గొని స్వర్గీయ నందమూరి తారక రామారావుకు ఘనమైన నివాళులు అర్పించారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవ పల్లెలోని బజార్‌లో దివంగత మాజీ ముఖ్య మంత్రి ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను టిడిపి బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్య క్రమంలో టిడిపి నాయకులు భీమా మునిస్వామి, చామంచి పెంచలయ్య, మోడపోతుల రాము, కానకుర్తి వెంకటయ్య, గౌస్‌బేగ్, కాంట్రాక్టర్ వెంకటసుబ్బయ్య, తుంటి రమణయ్య, బుర్ర సుబ్బ రాయుడు, చిన్న వెంకటేశు, పూర్ణ, సుంకర సుబ్బ రాయుడు, అప్పయ్య పాల్గొన్నారు. నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలు టిడిపి మాజీ సర్పంచ్ కొల్లిరవి నాయుడు, సీనియర్ నాయకుడు తాటికుంట్ల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవినాయుడు, వెంకటేష్ నాయుడు, విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి, బిసిసెల్ సురేష్, వీరాంజనేయులు, దాము, మధు, నాగేష్, శ్రీనాథ్, అంజి, సుబ్బయ్య, చంద్రబాబు, వెంకటేశ్వర్లు, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట : పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న ఫర్వీన్‌తాజ్

ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కొల్లి రవినాయుడు

రిజర్వాయర్లపై చంద్రబాబు కుతంత్రాలను తిప్పికొడతాం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ప్రజాశక్తి- కురబలకోట

మూడు నియోజక వర్గాల ప్రజల ఆకాంక్ష ప్రతిష్టాత్మక ముదివేడు రిజర్వాయర్ పనులు చేపట్టడంలో తగ్గేదేలేదని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఆదివారం రిజర్వాయర్ వద్ద నియోజక వర్గ రైతులు, మహిళలతో పెద్ద ఎత్తున రైతు సదస్సు నిర్వహించారు. నియోజక వర్గంలోని నలు మూలల నుండి పెద్ద సంఖ్యలో రైతులతో పాటు వివిధ వర్గాల వారు విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదివేడు రిజర్వాయర్ తంబళ్లపల్లెతో పాటు పీలేరు, మదనపల్లె నియోజక వర్గాలకు వరమన్నారు. ఇలాంటి రిజర్వాయర్ పై గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసి దీనిని అడ్డుకోవడం అభివృద్ధిని అడ్డు కోవడమేనన్నారు. ఈ రిజర్వాయర్ కు భూములతో పాటు ఊర్లు పోగొట్టుకుంటున్న రైతుల త్యాగాలను అవమానించినట్లేనన్నారు. రైతుల పొట్ట కొట్టి బాగుపడిన వారు చరిత్రలో లేరన్న విషయాన్ని బాబు గుర్తుంచుకోవాలన్నారు. నియోజక వర్గానికి గుండెకాయల చరిత్రలో ఈరిజర్వాయర్ మహా ఘట్టంగా నిలుస్తుందన్నారు. నియోజక వర్గ రూపురేఖలు మారుతాయన్నారు.చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ ప్రోద్భలంతో దీన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇలాంటి పనులు చేయడం కన్నా అభివృద్ధికి దోహదపడి ఉంటే మూడు రిజర్వాయర్ల ప్రారంభోత్సవానికి ఆయన్ను కూడా ఆహ్వానించి ఉండేవారమన్నారు. చంద్రబాబు కోరితే శిలా ఫలకాలపై ఆయన పేరు కూడా వేసి ఉండేవారమన్నారు. రూ.759 కోట్లతో ప్రారంభమైన రిజర్వాయర్ మూడు నియోజక వర్గాల అభివృద్ధికి వారధిగా నిలుస్తుందన్నారు. హంద్రీనీవా కాలువను కూడా మూడింతలు వెడల్పు చేయడం జరుగుతుందన్నారు. 35 వేల ఎకరాలకు పైగా సాగునీరు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ నిర్వాసితులకు కూడా వారు నచ్చిమెచ్చేలా సంతప్తికరంగా పరిహారం ఇవ్వడంతోపాటు పునరావాసం కల్పించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిటిడి సభ్యులు పోకల అశోకకుమార్, బైసాని జ్యోతి, చంద్రశేఖర్‌రెడ్డి, బి, దస్తగిరి, పూర్ణచంద్రిక, ఎన్‌విఆర్, డీఆర్.ఉమాపతిరెడ్డి, అరుణమ్మ ఖలీల్, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి. స్టోర్ గోపాల కృష్ణారెడ్డి, డిఆర్.విశ్వేశ్వరరెడ్డి, అంజాద్ ఖాన్, క్రాస్ నారాయణరెడ్డి, మైనుద్దీన్, ఎం.ప్రభాకర్ రెడ్డి, గోపి, వసంతరెడ్డి, పీఆరో గంట్ల సురేంద్ర, కృష్ణారెడ్డి, సిరి. కులదీప్రెడ్డి. వెంకటరెడ్డి, ముస్తర్, చౌడేశ్వర, మధు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి

ఎన్‌పిఎల్ విజేత గోపి లెవన్

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు ప్రీమియర్ లీగ్(ఎన్‌పిఎల్) ఏడవ సీజన్ విజేతగా వెంకట రాజంపేట గోపి లెవెన్ జట్టు నిలిచింది. దాదాపు 17 రోజులపాటు ఉత్కంఠ భరితంగా కొనసాగిన ఈ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్లో నందలూరు సికిందర్ లెవన్స్ వారు రన్నర్స్‌గా నిలిచారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లెలోని నందలూరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఈ టోర్నమెంట్కు వేదిక అయింది. వెంకట రాజంపేట టాస్ గెలిచి బ్యాటింగును ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 168 పరుగులు చేయడం జరిగింది. ఈ జట్టులోని మణికంఠ 43, యాసిర్ 42, మధు 27 పరుగులు చేశారు. అనంతరం 169 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన నందలూరు సికిందర్ జట్టు 16.4 ఓవర్లలో అన్ని వికెట్లను కోల్పోయి 139 పరుగులు చేసి పరాజయం చెందింది. ఈ జట్టులోని ఫయాజ్ 38, అంజి 34, పరుగులు చేశారు. మూడు ఓవర్లలో ఐదు పరుగులు ఇచ్చి రెండు వికెట్లను తీయడంతో పాటు 42 పరుగులు చేసిన వెంకటరాజంపేట బ్యాట్స్మెన్ యాసిర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నాడు. మధ్యాహ్నం దివంగత రైల్వే ఉద్యోగి ముని శంకర్ జ్ఞాపకార్థం క్రీడాకారులకు, క్రీడా అభిమానులకు వారి మిత్రులు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవం వేడుకలకు విశిష్ట అతిథులుగా రాజంపేట యువ నాయకులు మేడా విజయ శేఖర్‌రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, లోకేష్, జాతీయ మైనారిటీ కమిషన్ ఆంధ్ర ప్రదేశ్ సలహాదారు షబ్బీర్ అహ్మద్, డాక్టర్ అరిగె రాంప్రసాద్, స్థానిక నాయకులు, పోతురాజు మస్తానయ్య, ఆర్ముగం విశ్వనాధ్, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, నజీర్, సుధాకర్ బాబులు హాజరయ్యారు. ఈ టోర్నమెంట్ విజేత వెంకట్రాజంపేట జట్టు రూ.50116లు, విన్నర్స్ ట్రోఫీ, రన్నర్స్ నందలూరు సికిందర్ లెవెన్స్ రూ.30,116 రూపాయలు, రన్నర్స్ ట్రోఫీని అతిథుల నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు క్రీడాభిమానులు అరవపల్లె ప్లే గ్రౌండ్ యూత్ పాల్గొన్నారు.

మహిళలకు భోజనం పొట్లాన్ని అందిస్తున్న జయరామయ్య

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-కలకడ

అన్నదానం గొప్ప కార్యక్రమమని ఎంపిహెచ్ఇఒ జయరామయ్య పేర్కొన్నారు. ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిహెచ్ఇఒగా విధులు నిర్వహిస్తున్న జయరామయ్య దంపతులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారిని చూసి నాకెందుకులే అని అనుకోకుండా తమకు తోచిన సాయం చేయాలని కోరారు. పేదవారికి తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఆకలితో అలమటిస్తున్న వారికి ఒక్క పూటైనా భోజనం అందించాలని పేదలకు ఆహారాన్ని పంపిణీ చేశామన్నారు. ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చుతున్న జయరామయ్య దంపతులను స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.

జగన్మోహన్‌రాజుకు మెమొంటో అందిస్తున్న చంద్రబాబు

మహానాడుకు 'చమర్తి' రూ.15 లక్షల విరాళం

ప్రజాశక్తి-వీరబల్లి

రాజమండ్రిలో జరుగుతున్న టిడిపి మహానాడుకు రాజంపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు రాజు విద్యాసంస్థ అధినేత జగన్మోహన్‌రాజు రూ.25 లక్షల విరాళాన్ని టిడిపి అధినేత నారా చంద్ర బాబును కలిసి అందించారు. టిడిపి పార్టీ ఫండ్‌గా అందజేసినందుకు ఈ సంద ర్భంగా చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రాజును శాలువాతో సత్కరించి, మొమెంటో బహుకరించారని ఆయన తెలిపారు. పార్టీకి అండగా ఉంటూ, పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నావని ప్రశంసించారని తెలిపారు. చంద్రబాబు మళ్ళీ ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టే వరకు తాను సైనికుడిలా పని చేస్తానన్నారు.నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అభివృద్ధి చేస్తానన్నారు.

వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

వేరుశనగ విత్తన పంపిణీ సజావుగా జరగాలి

ప్రజాశక్తి-రామాపురం

వేరుశనగ విత్తనాలు పంపిణీ సజావుగా జరపాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుద్దమళ్ళ గ్రామం, యర్రాంరెడ్డిగారిపల్లె రైతుభరోసా కేంద్రంలో ఆదివారం సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీని కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికె కేంద్రంలో నాణ్యమైన, నమ్మదగిన వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో ఖరీఫ్‌సీజన్‌లో ముందస్తుగానే అందిస్తు న్నారన్నారు. 40 శాతం సబ్సిడీతో 30 కిలోల ప్యాకెట్ రైతులకు అందించారు. కార్యక్రమంలో వీఎఎ ప్రవీణ్ కుమార్ రెడ్డి, గ్రామవాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై సూచన బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ రామ్మోహన్

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సైబర్ నేరాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామ్మోహన్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల గురించి ఇంటర్నెట్ ఆధారంగా జరిగే వక్తిగత, ఆర్థిక, భద్రత పరమైన తదితర నేరాలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా హ్యాకింగ్, ఫోటో మార్ఫింగ్, పర్సనల్ డేటా చేంజెస్, ఏదైనా మీ సెల్ ఫోన్ ద్వారా ఒక లింకు పంపించి దాని ద్వారా ఫోన్, మెసేజ్ ద్వారా ఒటిపి చెప్పండని, వ్యక్తిగత సమాచారం సేకరించడం దాని ద్వార డబ్బులు తీసుకోవడం, ఓఎల్ఎక్స్ ద్వారా ఫేక్ లోన్‌అప్ ద్వారా నీకు లక్కీ డ్రిప్ తగిలిందని మోసపూరిత మాటల చెప్పి డబ్బు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీటి గురించి గ్రామ మహిళా పోలీసుల ద్వారా మండల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇకపోతే రోడ్డు ప్రమాదాలపై వాహనాదారులు, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ దరించి వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతి వేగం ప్రమాదకరమని తెలిపారు. అదేవిదంగా ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా బండ్లు నడుపుతూ తమ ప్రాణాలను రక్షించుకోవడంతో,ప్రయాణకుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. రహదారి భద్రతా నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారించవచ్చునని ఆయన సూచించారు.

నేడు వైసిపి నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

3వేల బైక్‌లతో మైదుకూరు నియోజకవర్గంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు మేనిఫెస్టో ప్రకటించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టిందన్నారు. టిడిపి ప్రజలకు చేసిన మోసాన్ని గుర్తు చేసేందుకు ఈ నిరసన ర్యాలీ చేపడుతున్నామన్నారు. ర్యాలీ సోమవారం పాత దువ్వూరులోని కోదండ రామాలయం నుండి ప్రారంభమై గుడిపాడు-చింతకుంట-మైదుకూరు మీదుగా ఖాజీపేటలోని కెసి కెనాల్ బంగ్లా వరకు నిర్వహి స్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీపీ టి.లక్ష్మమయ్య, వైసీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, గృహసారధుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, పార్టీ నాయకులు వినయ్ కుమార్‌రెడ్డి, రామచంద్రయ్య, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహిమాన్‌ఖాన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి

రహిమాన్‌ఖాన్ సేవలు అభినందనీయం : 'మేడా'

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఆటలపోటీల్లోనిర్వహణలో యువనాయకుడు పి.రహిమాన్ ఖాన్ అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పి.రహిమాన్ ఖాన్‌కు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి రహిమాన్ ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో వర్షం పడినప్పుడు తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించారని అన్నారు. ప్రజా సమస్యలను వచ్చినప్పుడు వాటిని గుర్తించి పరిష్కరించడానికి సహకరించేవాడని కొనియాడారు. అనంతరం రహిమాన్‌ఖాన్ మాట్లాడుతూ మైనార్టీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేశానని అన్నారు. గత మూడు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో వచ్చే అతిథులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకున్నానని, తన సేవలను గుర్తించి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, జడ్‌పిటిసి, సర్పంచులు శ్రీనివాసులు సరోజ, రామస్వామిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కసూర్తి' సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పార్టీ అందించిన సేవలు ఆదర్శనీయమని రాజంపేట పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు దాసరిరాజు వాణిశంకర్, తెలుగు మహిళ గిరిజలు పేర్కొన్నారు. ఆదివారం విశ్వనాథనాయుడు ఆయన స్వగృహంలో కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అభిమాన, నిస్వార్థ ప్రజానాయకుడు ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కోరారు. తమకు కస్తూరి ఇచ్చిన ప్రోత్సాహం, ధైర్యం ఎన్నటికీ మరువలేనిదని తెలిపారు. రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షులు

నిరుపేదలను ఆదుకోవడమే 'మానవత' ఉద్దేశం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమాజంలోని నిరుపేదలను ఆదుకోవడమే మానవత సంస్థ ముఖ్య ఉద్దేశమని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి సేవా మందిరంలో మండల అధ్యక్షులు బిడ్డల కేశవ రెడ్డి ఆధ్వర్యంలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవడం కోసం సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. మానవుడిగా మన జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్రీజర్ బాక్సులు, వైకుంఠ రథం, రోడ్డు పక్కన బల్లలు ఏర్పాటు చేయడం జరిగిందని, ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీళ్లభాస్కర్, శంకర, చంద్ర, ఆనంద శెట్టి, లక్ష్మన్న, సత్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీపురంలో గంగాభవాని జాతర

వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామదేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. గంగాజలాలతో మహిళలు ప్రదర్శనగా పురవీధుల్లో తిరిగి స్థానిక బజారు వీధి, నాయక్ వీధి ప్రాంతాల్లోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, సభ్యులు కేశవరెడ్డి, బలరాం, విజయవర్మ, రవి, మహేష్, శివ, పూజారి జనార్ధన్, భక్తులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో...

పెద్దమండ్యం : మండలంలోని కుశావతినది ఒడ్డున వెలసిన గ్రామదేవత అయిన శ్రీఎల్లమ్మ జాతర శనివారం రాత్రివైభవంగా జరిగింది. శనివారం ఉదయం అమ్మ వారికి అభిషేకం, ఆ తరువాత రాత్రి వివిధ పుష్పపల్లకిలో విద్యుత్ కాంతులతో, మంగళ వాయిద్యాలతో, బాణసంచా వేడుకలుతో ఉరిగింపు గావించి ఆతర్వాత, దీపాలు, బాణాలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృత పరచడమే లక్ష్యం

పీలేరు : నాయీబ్రాహ్మణుల సాంస్కృతిక కార్యక్రమాలను విస్తృత పరచడమే సంఘ ముఖ్య లక్ష్యమని నాయీ బ్రాహ్మణ సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గుడిబండ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన పీలేరు డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నాయీ బ్రాహ్మణ సాంస్కృతిక సంక్షేమ సంఘ ఉన్నతికి చేపట్టవలసిన కార్యక్రమాలపై దిశ, నిర్దేశం చేశారు. నాయీబ్రాహ్మణ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్, మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నాయి బ్రాహ్మణ సాంస్కృతిక సంక్షేమ సంఘం అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అమలుపరచడానికి జిల్లా కార్యవర్గ సభ్యులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. నాయీ బ్రాహ్మణ సాంస్కృతిక కార్యక్రమాల అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సాంస్కృతిక సంక్షేమ సంఘం, వేణుగోపాల్, భాస్కర్, శెట్టిపల్లి శంకర్, నాగరాజ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన నిమ్మనపల్లి మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన మల్లీశ్వరయ్య(వేణు) (46) ఆదివారం మధ్యాహ్నం మదనపల్లి నుంచి నిమ్మనపల్లెకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆచార్లపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడటంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై రోడ్డుపై నిచ్చలంగా పడి ఉండడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి, హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వేలూరు సిఎంసి ఆస్పత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. బాధితుడు అభ్యుదయ స్కూల్ బస్సు డ్రైవర్‌గా వెళ్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. సంఘట పై పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.